సాక్షి నిజామాబాద్

గురువారం, 15, మే, 2025



రోడ్డు ప్రమాదంలో..

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు మృతి చెందిన విషాద ఘటన చేపూర్ శివారులోని ఎన్‌హెచ్ 63పై చోటు చేసుకుంది.

- 8లో ▸



'వెంచర్' చేస్తే..

నుడా పరిధిలో వెంచర్ వేయాలంటే నిబంధనలు తూ.చ. తప్పకుండా పాటించాల్సిందేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.6 /22.0

ఆకాశం మేఘావృతమవుతుంది. ఎండ తీవ్రత తక్కువగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ప్రతిభ అవార్డులకు దరఖాస్తులు

నిజామాబాద్ రూరల్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో జిల్లాలోని ఎస్సెస్సీ, ఇంటర్, ఇంజినీరింగ్‌లో అత్యంత ప్రతిభ కనబరిచిన ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభ అవార్డులు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 2024–2025వ సంవత్సరానికి ఎస్సెస్సీలో 550 ఆపైన మార్కులు, ఇంటర్‌లో 970 ఆపైన మార్కులు, ఎంసెట్‌లో 1000 లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఈ నెల 25వ తేదీ సాయంత్రంలోగా మార్కుల జాబితా, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, సెల్ నంబర్, పేరు తదితర వివరాలను గోత్రం నారాయణ 9440090511 నంబర్‌కు పంపాలన్నారు. అవార్డుల ప్రదానోత్సవం వివరాలు తెలియజేస్తామన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



రెంజల్(బోధన్): నేటి నుంచి మూడు రోజుల పాటు జనగామ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ పోటీలకు మండలంలోని తాడ్‌బిలోలి పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం రేఖ, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సోమలింగంగౌడ్, పీఈటీ కుమార్ తెలిపారు. తాడ్‌బిలోలి పాఠశాల నుంచి నయనశ్రీ, అక్షయ, శృతి, అమర్, మహేశ్ ఎంపికైనట్లు వివరించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

'ఐ యామ్ ఏ ఫార్మర్'

- పెళ్లిపత్రికలో సగర్వంగా ముద్రించుకున్న యువరైతు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రైతేరాజు అనేది అనాదిగా ఉన్న నానుడి. అయితే రానురాను వ్యవసాయం చేస్తున్న యువకులను పెళ్లిచేసుకునేందుకు మాత్రం అమ్మాయిలు ముందుకు రావడం లేదు. దీంతో వ్యవసాయం చేస్తున్నానని చెప్పుకునేందుకు సైతం యువత ముందుకు రాని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఓ యువకుడు తాను రైతునని గర్వంగా చాటుకుంటున్నాడు. తన వివాహ పత్రికపై 'ఐ యామ్ ఏ ఫార్మర్' అని పేరు పక్కన సగర్వంగా పెట్టుకున్నాడు. అదేవిధంగా నాగలి పట్టిన రైతు, ఎద్దుల బొమ్మను ఉండేలా పత్రికను ముద్రించుకున్నాడు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం మాతు సంగెం గ్రామానికి చెందిన యువ రైతు జ్ఞానేశ్వర్, సౌందర్య వివాహం ఈ నెల 22వ తేదీన గాంధారిలో జరగనుంది. వివాహ పత్రిక చూసినవారు దీనిపై చర్చించుకుంటున్నారు.

విధులకు డుమ్మా.. రిజిస్టర్‌లో హాజరు



సిరికొండ పీహెచ్‌సీ రిజిస్టర్‌లో ఏప్రిల్ నెలలో సంతకాలు చేయని సీహెచ్‌వో



ఏప్రిల్ నెలలో ఒకేసారి సంతకాలు చేసిన సీహెచ్‌వో

సిరికొండ పీహెచ్‌సీలో విధులు నిర్వర్తించే ఉద్యోగి ఒకరు తన జీతంలో నుంచి ప్రతి నెలా మెడికల్ ఆఫీసర్‌కు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు ఇస్తూ డ్యూటీకి హాజరుకావడం లేదు. సదరు ఉద్యోగి నెలలో ఒకటి, రెండుసార్లు దర్జాగా పీహెచ్‌సీకి వచ్చి రిజిస్టర్‌లో సంతకాలు చేసి వెళ్తున్నాడు. ఇదే పీహెచ్‌సీలో మరో ఉద్యోగినితోపాటు ఓ అటెండర్ విధులకు హాజరుకాకుండా రిజిస్టర్‌లో ఒకేసారి సంతకాలు చేస్తున్నా మెడికల్ ఆఫీసర్ పట్టించుకోకపోడానికి కారణం నెలవారి చెల్లింపులే అని స్థానిక సిబ్బంది అంటున్నారు.


- పీహెచ్‌సీలలో ఇష్టారాజ్యం
- జీతంలో నుంచి కమీషన్ ఇస్తూ విధులకు డుమ్మా కొడుతున్న సిబ్బంది
- దర్జాగా హాజరు వేసుకుంటున్న వైనం
- పైస్థాయి అధికారుల పర్యవేక్షణ ఉన్నట్టా? లేనట్టా?
- రోగుల ఇబ్బందులు దేవుడెరుగు..



నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని పలు పీహెచ్‌సీల్లో ఉద్యోగులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రోజులతరబడి విధులకు డుమ్మా కొడుతూ నెలనెలా మెడికల్ ఆఫీసర్‌లకు కమీషన్‌లు ఇస్తూ రిజిస్టర్‌లలో ఒకేసారి సంతకాలు చేస్తున్నారు. పీహెచ్‌సీ పరిధిలో మెడికల్ ఆఫీసరే బాస్ కావడంతో కమీషన్‌లు ఇచ్చే ఉద్యోగులు, సిబ్బంది హవా నడుస్తోంది. ప్రభుత్వం నుంచి ఠంచన్‌గా జీతాలు తీసుకుంటున్న వారు విధులకు న్యాయం చేయడం లేదు. కమీషన్‌ల ఆశలో మునిగిన మెడికల్ ఆఫీసర్లు పట్టించుకోకపోవడం, పైస్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పీహెచ్‌సీల్లో పరిస్థితి రోజు రోజుకు అధ్వానంగా మారుతోంది.

రోగులను పట్టించుకునే వారు కరువు

స్థానిక ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందక గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. కొన్ని చోట్ల వైద్యులు, ఉద్యోగులు ఇష్టారాజ్యంగా విధులకు డుమ్మాకొడుతుండడంతో దిక్కులేక ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సౌకర్యాలు మాట పక్కనపెడితే అసలు విధులకే హాజరుకాని వారు వైద్య సేవలు ఎలా అందిస్తారని ప్రశ్నిస్తున్నారు.



ఓ ఉద్యోగిని నెలలో 22 సీఎల్‌లు పెట్టిన దృశ్యం

ఉన్నతాధికారులతో మాకేం సంబంధం

మండలాల పరిధిలో ఉన్న పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలకు మెడికల్ ఆఫీసర్‌లే బాస్‌లు. ఇంకేముంది ఆపైన ఉన్న డిప్యూటీ డీఎంహెచ్‌వో, జిల్లా వైద్యాధికారులతో మాకేం సంబంధం అన్నట్లు ఉద్యోగులు, సిబ్బంది వ్యవహరిస్తున్నారు. ఒక్కో పీహెచ్‌సీ పరిధిలో మెడికల్ ఆఫీసర్, సీహెచ్‌వో, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ల్యాబ్‌టెక్నీషియన్, ఎంఎన్‌వో, డీఈవో, ఫార్మసి, స్టాఫ్ నర్సులు, ఎంఎల్‌హెచ్‌పీ, అటెండర్లు తదితర పోస్టులు ఉన్నాయి. కమీషన్‌లు ఇచ్చే ఉద్యోగులు ఒకటిరెండు రోజులు కాదు ఏకంగా నెలల తరబడి విధులకు హాజరు కాకున్నా మెడికల్ ఆఫీసర్లు పట్టించుకోవడం లేదు. కొన్ని ఆస్పత్రుల్లో ఫోర్జరీ సంతకాలు చేస్తున్నట్లు తోటి ఉద్యోగులే చర్చించుకుంటున్నారు.

రోగులను పట్టించుకునే వారు కరువు

స్థానిక ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందక గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. కొన్ని చోట్ల వైద్యులు, ఉద్యోగులు ఇష్టారాజ్యంగా విధులకు డుమ్మాకొడుతుండడంతో దిక్కులేక ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సౌకర్యాలు మాట పక్కనపెడితే అసలు విధులకే హాజరుకాని వారు వైద్య సేవలు ఎలా అందిస్తారని ప్రశ్నిస్తున్నారు.

జిల్లాలో ఆస్పత్రులు	
సబ్‌సెంటర్లు	225
పీహెచ్‌సీలు	27
యూపీహెచ్‌సీలు	10
సీహెచ్‌సీలు	07
ఏరియా ఆస్పత్రి	ఆర్మూర్
జిల్లా ఆస్పత్రి	బోధన్
జీజీహెచ్	నిజామాబాద్

నా దృష్టికి వస్తే కఠిన చర్యలు



నేను ప్రతిరోజూ మానిటరింగ్ చేస్తున్నాను. ఉదయం 10గంటలలోపు మెడికల్ ఆఫీసర్‌లు కిందిస్థాయి ఉద్యోగుల వెళ్లి లైవ్ ఫోటోస్ పెట్టాలని ఆదేశించాను. కోటగిరిలో ఓ ఉద్యోగికి డ్యూటీకి రాకున్నా జీతం వేయడంతో షోకాజ్ నోటీసు సైతం ఇచ్చాను. తనిఖీలకు వెళ్తున్నాను. ఎవరైనా మెడికల్ ఆఫీసర్‌లు కమీషన్‌లు తీసుకుని డుమ్మా కొట్టిన ఉద్యోగులకు అటెండెన్స్ వేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. – డాక్టర్ రాజశ్రీ, డీఎంహెచ్‌వో

ప్రభుత్వం గుర్తించిన సన్నాలనే సాగు చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- నకిలీ, నాణ్యతలేని విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కేసులు
- రైతులకు అవగాహన కల్పించాలి
- వన మహోత్సవానికి సన్నద్ధం కావాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వం గుర్తించిన 33 రకాల సన్నాలను రైతులు సాగు చేసేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. అలాగే ప్రభుత్వం నోటిఫై చేసిన వరి విత్తనాలను రైతులు వినియోగించాలని అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు, హౌసింగ్ ఏఈలు, ఏపీవోలు, సహకార శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో కలెక్టర్ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గుర్తించిన సన్నాలను కాకుండా ఇతర రకాలను కొంత మంది రైతులు సాగు చేస్తుండడంతో ధాన్యం సేకరణ సమయంలో కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. మరో రెండు వారాల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎక్కడ కూడా ఎరువులు, విత్తనాల కొరత తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. నకిలీ, నాణ్యత లోపంతో కూడిన విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 5.62 లక్షల ఎకరాల విస్తీర్ణంలో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేస్తారని అంచనా కాగా, అందులో ఒక్క వరి పంటనే 4.37 లక్షల ఎకరాల్లో సాగు చేసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం సన్నాలకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్న నేపథ్యంలో పూర్తి విస్తీర్ణంలో సన్నరకాలు సాగు చేస్తారని భావిస్తున్నామన్నారు.

భూభారతి అమలులో భాగంగా లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణ కోసం ఆసక్తి, అర్హత ఉన్న వారు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. ప్రైవేట్ సర్వేయర్లు ప్రభుత్వం నుంచి లైసెన్సు కోసం సీసీఎల్‌ఏ కమిషనర్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని తహసీల్దార్లకు కలెక్టర్ సూచించారు. రేషన్ (ఆహార భద్రత) కార్డులు, రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులు అందరూ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జూన్ మొదటి, రెండో వారంలో చేపట్టే వన మహోత్సవం కార్యక్రమానికి అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని సూచించారు. మొక్కల పంపిణీ కోసం నర్సరీల్లో సరిపడా మొక్కలు అందుబాటులో ఉంచాలని, పంపిణీ చేసే ప్రతి మొక్కనూ నాటి కాపాడుకునేలా చూడాలన్నారు. పూర్తి స్థాయి లక్ష్యానికి అనుగుణంగా జిల్లాలో మొక్కల పెంపకం జరగాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డీఆర్డీవో సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుర్తింపు ఉన్న సన్న వరి వంగడాలివే..

నిజామాబాద్ అర్బన్: ప్రభుత్వం 33 సన్న రకాల వరి వంగడాలను గుర్తించిందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. సిద్ధి (డబ్ల్యూజీఎల్ 44), కాంపసాగర్ వెరైటీ–1 (కేపీఎస్ 2874), సాంబ మసూరి (బీపీటీ 5204), జగిత్యాల వెరైటీ–3 (జీజీఎల్ 27356), జగిత్యాల వెరైటీ–2 (జీజీఎల్ 28545), వరంగల్ సాంబా (డబ్ల్యూజీఎల్ 14), వరంగల్ సన్నాలు(డబ్ల్యూజీఎల్ 32100), జగిత్యాల మసూరి (జేజీఎల్ 11470), పోలాస ప్రభ (జేజీఎల్ 384), కృష్ణ (ఆర్‌ఏఆర్ 2458), మానేరు సోనా (జేజీఎల్ 3828), తెలంగాణ సోనా (ఆర్‌ఏఆర్ 15048), వరంగల్ వెరైటీ–1119, కూనారం వెరైటీ–2 (కేఎన్‌ఎమ్ 1638), వరంగల్ వెరైటీ–2 (డబ్ల్యూజీఎల్ 962), రాజేంద్రనగర్ వెరైటీ–4 (ఆర్‌ఏఆర్ 21278), కూనారం వెరైటీ–1 (కేఎన్ఎం 733), జగిత్యాల సన్నాలు (జేజీఎల్ 1798), జగిత్యాల సాంబా (జేజీఎల్ 3844), కరీంనగర్ సాంబా (జేజీఎల్ 3855), అంజన (జేజీఎల్ 11118), నెల్లూరు మసూరి (ఎన్ఎల్ఆర్ 34449), ప్రత్యుమ్న (జేజీఎల్ 17004), సుగంధ సాంబా (ఆర్‌ఏఆర్ 2465), శోభిని(ఆర్ఎన్ ఆర్ 2354), సోమనాథ్ (డబ్ల్యూజీఎల్ 347), ఆర్‌ఏఆర్ 31479 (పీఆర్‌సీ), కేపీఎస్ 6251 (పీఆర్‌సీ), జేజీఎల్ 33124 (పీఆర్‌సీ), హెచ్‌ఎంటీ సోనా, మరుటేరు సాంబా (ఎంటీయూ 1224), మరుటేరు మసూరి (ఎంటీయూ 1262), ఎంటీయూ 1271 రకాలు.

ఈదురు గాలుల బీభత్సం



రాలిన మామిడికాయలు

సిరికొండ: మండలంలోని తాటిపల్లి గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. గాలి ఉధృతికి నాలుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 20 స్తంభాలు ధ్వంసమయ్యాయి. ఇళ్ల పైకప్పులు, రేకులు లేచిపోయాయి. తన మామిడి తోటలో మామిడి కాయలు రాలిపోయి చెట్లు విరిగిపోయాయని బొల్లం కిష్టయ్య అనే వ్యక్తి తెలిపారు. పొన్నం దేవయ్య నివాస గుడిసె పైకప్పు, బానావత్ రవి ఇంటి పైకప్పు రేకులు, మాలావత్ హరిలాల్ ఇంటి పైకప్పు రేకులు, శ్రీగాధ నారాయణకు చెందిన పిండి గిర్ని పైకప్పు రేకులు, దాసారపు శంకర్ ఇంటి పైకప్పు లేచిపోయిందని గ్రామస్తులు తెలిపారు.

ఎన్‌హెచ్ 63పై రైతుల రాస్తారోకో

- వర్షానికి ధాన్యం తడిసిందని ఆవేదన
- గంటపాటు ట్రాఫిక్‌జామ్



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో రాజాగౌడ్

ఆర్మూర్‌టౌన్: ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో వర్షానికి తడిసిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు ఆర్మూర్ పట్టణంలోని ఆలూర్ బైపాస్ రోడ్డు జాతీయ రహదారి 63పై బుధవారం ధర్నా చేశారు. 20 రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు చేయడం లేదని, తక్షణమే ధాన్యం కాంటా చేసి రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మంగళవారం సాయంత్రం అధికారులను ఆదేశించినా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఆర్డీవో, డీఎస్‌వో శ్రీనివాస్ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. త్వరలోనే ధాన్యం కొనుగోలు చేసి, రైస్ మిల్లులకు తరలిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. రైతులకు బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆశన్నగారి రాజేశ్వర్ రెడ్డి, బీజేపీ నాయకులు నూతుల శ్రీనివాస్ మద్దు తెలిపారు. ధర్నాతో రోడ్డుకు ఇరువైపులా సుమారు 5కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

ముంపు గ్రామాలు ఉపాధికి దూరం

- చెరువుల్లేక పనులు కల్పించని అధికారులు
- ముంపు భూముల్లో పనులకు అనుమతివ్వని ఇరిగేషన్ శాఖ
- ఉపాధిని కోల్పోతున్న ఆరు గ్రామాల ప్రజలు



చిన్నయానం వద్ద ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో ఉపాధిహామీ పనులు చేస్తున్న గ్రామస్తులు (ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్): ఎస్సారెస్పీ ముంపు గ్రామాలు ఉపాధిహామీ పనులకు దూరమయ్యాయి. డొంకేశ్వర్ మండలంలో కొన్ని గ్రామాలకు చెరువులు లేకపోవడంతో అధికారులు పనులు కల్పించలేకపోతున్నారు. ముంపు నుంచి తేలిన భూముల్లో పనులు చేయడానికి ఇరిగేషన్ అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో ఉపాధి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. చిన్నయానం, గంగాసముందర్, జీజీ నడ్కుడ, గాదేపల్లి, అన్నారం, సిర్పూర్ గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఉపాధిహామీ పనులు లేకపోవడంతో ఉపాధిని కోల్పోతున్నామని ఈ గ్రామాల ప్రజలు, నిరుద్యోగ యువత తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. నూత్‌పల్లి, డొంకేశ్వర్, నికాల్‌పూర్ గ్రామాలు కూడా ముంపు గ్రామాలే అయినప్పటికీ ఊరు శివార్లలో చెరువులు ఉండడంతో అక్కడ ఫిష్ పాండ్‌లు తవ్వించి ఉపాధిని కల్పిస్తున్నారు. ఇప్పుడు సమస్య వచ్చిందల్లా చెరువులు లేని ఆరు గ్రామాలకే.

ఈ ఏడాది నుంచే అనుమతి నిరాకరణ...

చిన్నయానం, గంగాసముందర్, జీజీ నడ్కుడ, గాదేపల్లి, అన్నారం, సిర్పూర్ గ్రామాలకు సంబంధించిన చెరువులు ఎస్సారెస్పీలో ముంపునకు గురవుతాయి. ప్రతీ ఏడాది వేసవిలో ముంపు నుంచి తేలడంతో గత కొన్నేళ్లుగా ఉపాధిహామీ పనులు బ్యాక్ వాటర్‌లోనే జరిగాయి. ఎస్సారెస్పీ భూముల్లో ఫిష్ పాండ్‌లు తవ్వడానికి ఇరిగేషన్ అధికారులు ఈ ఏడాది అనుమతి ఇవ్వలేదు. పనులు చేపట్టేందుకు వీలు లేదని ఈజీఎస్ అధికారులకు తేల్చి చెప్పారు. వేరే పనులు గుర్తించి చేయించడానికి ఈ గ్రామాల్లో అవకాశం లేకుండా పోయింది. అవకాశం ఉన్న చోట కొద్ది మందికి మాత్రమే కెనాల్ పనులు కల్పిస్తున్నారు. అయితే ఎస్సారెస్పీ ఇరిగేషన్ భూముల్లో ఉపాధి పనులు చేపట్టేందుకు అవకాశం ఇవ్వాలని కోరినట్లు ఏపీవో సరిత, ఎంపీడీవో తెలిపారు. అప్పటి వరకు వేరే పనులు గుర్తించి ముంపు గ్రామాల ప్రజలకు పనులు కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఇప్పటికే చాలా కోల్పోయాం



ఎస్సారెస్పీకి మా ఊరి భూములిచ్చి చాలా కోల్పోయాం. సరైన ధర ప్రభుత్వం ఇవ్వలేదు. మా పాత భూముల్లో ఉపాధి పనులు చేసుకోవడానికి ఇరిగేషన్ అధికారులు ఎందుకు అభ్యంతరం తెలుపుతున్నారో అర్థం కావడం లేదు. ఉపాధిహామీ పనులు నిలిచిపోవడంతో ఉపాధిని కోల్పోతున్నాం. అన్ని విధాలుగా మాకు నష్టమే జరుగుతోంది. – పెద్దగొండ మోహన్, చిన్నయానం

పేదలకు ఉపాధి లేకుండా పోయింది



ముంపు భూముల్లో ఉపాధిహామీ పనులు బంద్ కావడంతో పేదలకు ఉపాధి లేకుండా పోయింది. గత ఏడాది వరకు పనులు కల్పించిన అధికారులు ఇక నుంచి లేదంటున్నారు. చాలా మంది నిరుద్యోగ యువతకు ఉపాధిహామీ పనులే ఆర్థిక ఆధారంగా ఉండేవి. అధికారులు స్పందించి ఉపాధిహామీ పనులు మళ్లీ ప్రారంభమయ్యేలా చూడాలి.
– ఎర్రం సుష్మిత, మాజీ సర్పంచ్, చిన్నయానం

బిచ్కుంద పీఎస్‌లో ఏసీబీ తనిఖీలు

- అక్రమ వసూళ్ల విషయంలో ఎస్సైపై విచారణ
- ఆరు గంటలపాటు కొనసాగిన సోదాలు



మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్

బిచ్కుంద: ఏసీబీ అధికారులు బుధవారం బిచ్కుంద పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారు. ఇసుక అక్రమ రవాణా వ్యవహారంలో ఎస్సై మోహన్‌రెడ్డి వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. సుమారు ఆరు గంటలపాటు స్టేషన్‌లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణా వ్యవహారంలో పోలీసులు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలున్నాయన్నారు. ఈ అంశంపై ఏసీబీ అధికారులకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీంతో తాము సోదాలు నిర్వహించామని పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితం ఎస్సై మోహన్‌రెడ్డి పట్టుకున్న పది ఇసుక ట్రాక్టర్లు పోలీస్ స్టేషన్‌లో ఉన్నాయని, వారిని డబ్బులు అడిగారని, అలాగే గతంలో పలు కేసులలో అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో తేలిందని పేర్కొన్నారు. దాని ఆధారంగా పూర్తి విచారణ చేసి పైఅధికారులకు నివేదిక పంపిస్తామన్నారు. కాగా మంజీర నది పరీవాహక ప్రాంతాల నుంచి వందలాది ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని ఫిర్యాదు చేసినవారెవరూ సాక్ష్యం చెప్పడానికి ముందుకు రావడం లేదని ఏసీబీ డీఎస్పీ పేర్కొన్నారు. అవినీతికి పాల్పడుతున్న ఏ శాఖ అధికారులపైనైనా ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

జరిమానా కట్టినా వదలడం లేదు

జరిమానా కట్టినా పోలీసులు ట్రాక్టర్లు వదిలిపెట్టడం లేదని పలువురు ట్రాక్టర్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారుల అనుమతితో ఇసుక తరలిస్తున్నామని, పట్టుకున్న పది ట్రాక్టర్లను ఎస్సై మోహన్‌రెడ్డి మైన్స్ అధికారులకు అప్పగించారని పేర్కొన్నారు. మైన్స్ అధికారులు విధించిన జరిమానా చెల్లించి నాలుగు రోజులవుతున్నా పోలీసులు ట్రాక్టర్లు వదిలిపెట్టడం లేదన్నారు.

క్లుప్తంగా

ఇసుక టిప్పర్‌ను పట్టుకున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్‌..

మద్నూర్‌(జుక్కల్‌): ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌ఐ సాయిబాబా హెచ్చరించారు. 'సాక్షి'లో ఇటీవల ప్రచురితమైన 'ఆగని ఇసుక అక్రమ రవాణా' అనే కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. బాన్సువాడ సబ్‌ కలెక్టర్‌ కిరణ్మయి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు డోంగ్లీ ఆర్‌ఐ సాయిబాబా తెలిపారు. దీంతో బుధవారం తెల్లవారుజామున డోంగ్లీ మండలంలోని లింబూర్‌ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని మద్నూర్‌ పోలీస్‌ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

'వెంచర్‌' చేస్తే.. పక్కాగా ఉండాల్సిందే

- టీఎస్‌బీపాస్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- నుడా అనుమతి తప్పనిసరి
- 10 శాతం స్థలం ఖాళీగా ఉంచాలి



నిజామాబాద్‌ సిటీ: నుడా పరిధిలో వెంచర్‌ వేయాలంటే నిబంధనలు తూ.చ. తప్పకుండా పాటించాల్సిందేనంటున్నారు అధికారులు. ప్రభుత్వ అనుమతులు సరిగా లేకున్నా, వివాదాస్పద స్థలాలున్నా నిబంధనలు అతిక్రమించినా వెంచర్ల కథ కంచికేనంటున్నారు. గతంలో వెంచర్లు ఎలా చేసినా చెల్లుబాటు అయింది. కానీ, ప్రస్తుతం మాత్రం టీఎస్‌ బీపాస్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సిందేనని, సరైన ధృవీకరణ పత్రాలుంటేను వెంచర్లకు అనుమతి మంజూరు చేస్తామని స్పష్టం చేస్తున్నారు.

విచ్చలవిడిగా వెలుస్తున్న వెంచర్లు..

నగర శివార్లతోపాటు నుడా పరిధిలో వెంచర్లు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగా రియల్టర్లు వెంచర్లు చేస్తున్నారు. అనుమతులు లేకుండానే ప్లాటింగ్‌ చేసి వాటిని దళారులతో అమ్మిస్తున్నారు. కొన్నిచోట్ల అక్రమ నంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు కూడా చేయిస్తున్నారు. వాటిని కొనుగోలు చేసిన అమాయకులు లబోదిబోమంటున్నారు. అమాయకులే లక్ష్యంగా రియల్టర్లు స్థానిక నాయకులతో ములాఖత్‌ అవుతున్నారు. వారికి కమీషన్‌ ఆశ చూపి వారితో ప్లాట్లను విక్రయిస్తున్నారు. అనుకున్నదే తడవుగా, స్థలం ఉంటే చాలు వెంచర్లు వేస్తున్నారు. ముందస్తు అనుమతులు లేకున్నా పనులు మొదలుపెడుతున్నారు. రాత్రింబవళ్లు పనులు చేసి అధికారుల దృష్టికి వచ్చేలోపు ప్లాట్లన్నీ అమ్మేస్తున్నారు.

నగర శివార్లలో అధికం..

మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని నగర శివార్లలో ఈ అక్రమ వెంచర్లు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. నాగారం, గొల్లగుట్ట, గాంధీనగర్‌, సారంగపూర్‌, శాస్త్రీనగర్‌, మల్కాపూర్‌–ఏ, ముబారక్‌నగర్‌, కేశాపూర్‌, బర్దిపూర్‌, బోర్గాం (పి), న్యాల్‌కల్‌, మోపాల్‌, సిరిపూర్‌, రాంనగర్‌, బోర్గాం (కె), ఖానాపూర్‌, గాడ్స్‌ కాలనీ, తారకరామనగర్‌ శివార్లలో వెంచర్లు వెలుస్తున్నాయి. 2 నుంచి 5 ఎకరాలున్నా చాలు వెంటనే వాటిని వెంచర్లు చేసి హాట్‌కేకుల్లా అమ్మేస్తున్నారు.

ప్రభుత్వ, ఇరిగేషన్‌, వక్ఫ్‌ భూములు..

వెంచర్లు చేస్తున్న రియల్టర్ల కన్ను ప్రభుత్వ, అసైన్డు, ఇరిగేషన్‌, వక్ఫ్‌ భూములు, స్మశానాలపై పడింది. దాంతో తమ స్థలంతో పక్కనే ఉన్న ఈ స్థలాలను సైతం కలుపుకుంటున్నారు. ఇలా నాలాలు, కుంటలు, స్మశాన వాటికలు, పబ్లిక్‌ పార్కుల స్థలాలనూ వదలడం లేదు.

విస్తరించిన నుడా పరిధి..

నిజామాబాద్‌ అర్బన్‌ డెవలప్‌మెంట్‌ అథారిటీ గతంలో కేవలం 72 గ్రామాలకే పరిమితమైంది. కాంగ్రెస్‌ ప్రభుత్వం 380 గ్రామాలకు విస్తరించింది. ఇందులో 3 మున్సిపాలిటీలు కూడా వచ్చాయి. ఈ పరిధిలో వెంచర్లు చేయాలంటే నుడా అధికారి డీసీపీ అనుమతి తప్పనిసరి. కానీ, స్థానిక నాయకుల సహకారంతో ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే వెంచర్లు వేయడం గమనార్హం.

నిబంధనలు ఇవే..

- వెంచర్‌చేసే స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు సరిగ్గా ఉండాలి.
- మొత్తం వెంచర్‌ విస్తీర్ణంలో 10 శాతం స్థలం వదిలివేయాలి. (ఈ స్థలంలో పార్కు, ఆస్పత్రి, కిరాణాషాపు, మెడికల్‌ షాపు వంటి వాటి కోసం).
- రోడ్లు, డ్రైనేజీలు, విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలి.
- ఏరియా మార్కెట్‌ రేటు ప్రకారం ఫీజును నుడాకు లేదా మున్సిపాలిటీకి చెల్లించాలి.
- 15 శాతం సొమ్ము చెల్లించిన తర్వాత మొదటి డ్రాఫ్ట్‌ ఇస్తారు.
- మొదట డమ్మీ వెంచర్‌ ఏర్పాటు చేయాలి.
- రెండేళ్ల తర్వాత వెంచర్‌ను పక్కాగా నిబంధనల మేరకు నిర్మించాలి.
- సూచించిన వసతులు, సౌకర్యాలు ఏర్పాటు చేసిన తర్వాతే ఫైనల్‌ లేఅవుట్‌ను అనుమతిస్తారు.

అక్రమ వెంచర్లు కూల్చివేస్తాం



వెంచర్‌ చేయాలనుకునేవారు టీఎస్‌ బీపాస్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. డాక్యుమెంట్లలో లోపాలుండొద్దు. సూచించిన స్థలంలోనే వెంచర్‌ చేయాలి. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. ప్రజలు జాగ్రతగా ఉండాలి. నాన్‌ లే అవుట్‌ వెంచర్లలో ప్లాట్‌లు కొని మోసపోవద్దు. ఇటీవల అనుమతి లేని వెంచర్లను తొలగించాం.

– శ్రీధర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్‌ చీఫ్‌ ప్లానర్‌

నుడా అనుమతి తీసుకోవాలి



టీఎస్‌ బీపాస్‌ ద్వారా అనుమతి పొంది, సరైన ఫీజు చెల్లించాలి. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టవద్దు. సరైన పత్రాలతో టౌన్‌ప్లానింగ్‌ అధికారులకు సహకరించాలి. నాన్‌ లేఅవుట్‌ వెంచర్లు చేస్తే తొలగిస్తాం. వెంచర్‌ పూర్తయిన తర్వాతే అమ్మకాలు చేయాలి. నగర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి.

– కేశ వేణు, నుడా చైర్మన్‌

ఘనంగా ఛత్రపతి శంభాజీ మహరాజ్‌ జయంతి



నినాదాలు చేస్తున్న సేవా సమితి సభ్యులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: హైందవ స్వరాజ రక్షకుడిగా, ధర్మవీరుడిగా పిలుచుకునే ఛత్రపతి శంభాజీ మహరాజ్‌ జయంతి కార్యక్రమాన్ని శ్రీ ఛత్రపతి శివాజీ మహరాజ్‌ సేవాసమితి ఇందూరు ఆధ్వర్యంలో నగరంలోని బోర్గాంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎం లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ మహనీయుడు ఛత్రపతి శంభాజీ మహరాజ్‌ భారతదేశంలో పుట్టడం అందరికీ గర్వకారణమన్నారు. ప్రతి హిందువు శంభాజీ మహరాజ్‌ను ఆదర్శంగా తీసుకొని దేశరక్షణ, ధర్మరక్షణ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ శంభాజీ మహరాజ్‌లా తయారుకావాలన్నారు. కార్యక్రమంలో గంగనర్సయ్య, గజానన్‌, దుర్గాప్రసాద్‌, బండారి నరేందర్‌, దిగంబర్‌, శ్రీనివాస్‌రెడ్డి, పోల్‌ అర్జున్‌, ప్రణయ్‌, శ్రావణ్‌ కుమార్‌, రాజు, జ్ఞానేందర్‌, రాజేశ్‌, మహేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని డీఏవో ఆఫీసు ఎదుట ధర్నా

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): తన భర్త మరణించి ఏడాదైనా కుటుంబానికి రావాల్సిన బెనిఫిట్స్‌ ఇప్పించడం లేదంటూ భీమ్‌గల్‌ మండలం చేంగల్‌కు చెందిన రాజ్యలక్ష్మి బుధవారం కలెక్టరేట్‌కు వచ్చింది. న్యాయం చేయాలని కుటుంబసభ్యులతో కలిసి జిల్లా వ్యవసాయ కార్యాలయం ఎదుట బైఠాయించింది. భర్త సంగెం ప్రవీణ్‌ ధర్పల్లి మండల వ్యవసాయాధికారిగా పని చేస్తుండగా గతేడాది మే నెలలో ఎన్నికల డ్యూటీలో గుండెపోటుతో మరణించాడని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెన్షన్‌తోపాటు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇతర బెనిఫిట్స్‌ రావాల్సి ఉందన్నారు. ఇంత వరకు వ్యవసాయ శాఖ అధికారులు వీటిని ఇప్పించకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అనంతరం కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతును కలిసి ఫిర్యాదు చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అమ్రాద్‌ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు

మాక్లూర్‌: మండలంలోని అమ్రాద్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 2005–06 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు బుధవారం పాఠశాల ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20ఏళ్ల తర్వాత కలుసుకున్న చిన్ననాటి మిత్రులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఆత్మీయంగా పలుకరించుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు. అనంతరం ఆటాపాటలతో సరదాగా గడిపారు.

ఉసురుతీసిన ఆన్‌లైన్‌ గేమ్‌

- రాయకూర్‌లో యువకుడి ఆత్మహత్య



గంగాధర్‌ (ఫైల్‌)

రుద్రూర్‌: ఆన్‌లైన్‌ గేమ్‌కు అలవాటుపడ్డ యువకుడు డబ్బులు పోవడంతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని రాయకూర్‌ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయకూర్‌ గ్రామానికి చెందిన మాగిరి గంగాధర్‌ (20) కొంతకాలంగా ఆన్‌లైన్‌ గేమ్‌ ఆడుతున్నాడు. డబ్బులు లేకపోవడంతో తండ్రి ఫోన్‌లో నుంచి రూ. 5 వేలు తన ఫోన్‌కు ట్రాన్స్‌ఫర్‌ చేసుకొని గేమ్‌ ఆడి పోగొట్టుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన గంగాధర్‌ మంగళవారం రాత్రి పాడుబడ్డ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకు ఇంటికి రాలేదని కుటుంబసభ్యులు వెతుకుతుండగా బుధవారం ఉదయం మృతదేహం కనిపించింది. మృతుడి తండ్రి పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తండ్రి మందలించాడని..

డిచ్‌పల్లి: పని చేయాలనీ లేదా చదువుకోవాలని తండ్రి మందలించడంతో కొడుకు ఆత్మహత్య చేసుకున్న ఘటన డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి శివారులోని ఇటుకబట్టీ వద్ద చోటుచేసుకుంది. ఎస్సై షరీఫ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన భరత్‌ మాజీ, అతని భార్య మెంట్రాజ్‌పల్లిలోని ఆంజనేయులుకు చెందిన ఇటుకబట్టీలో కొంతకాలంగా కూలీలుగా పనిచేస్తున్నారు. వారి కొడుకు మున్నీ మాజీ (14)ని స్థానికంగా చదువుకోవాలని లేదా పనిచేయాలని తండ్రి మంగళవారం మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన మున్ని మాజీ అర్ధరాత్రి తాము ఉంటున్న రేకుల షెడ్డులోని కర్రకు చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయాన్నే గమనించిన కుటుంబసభ్యులు బట్టీ యజమానికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని..

కామారెడ్డి క్రైం: భార్య కాపురానికి రావడం లేదని ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలోని జయశంకర్‌ కాలనీ శివారులో బుధవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి గ్రామానికి చెందిన తక్కడపల్లి శ్రీకాంత్‌ (32) మెకానిక్‌గా పని చేస్తూ బీడీ వర్కర్స్‌ కాలనీలో నివాసం ఉంటున్నాడు. అతనికి భార్య లత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గొడవల కారణంగా భార్య పిల్లలతో కలిసి మూడు నెలలుగా తల్లిగారి ఇంటి వద్ద ఉంటోంది. దీంతో శ్రీకాంత్‌ మద్యానికి బానిసయ్యాడు. భార్య కాపురానికి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన శ్రీకాంత్‌ బుధవారం జయశంకర్‌ కాలనీ సమీపంలోని ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌ రెడ్డి తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కరడ్‌పల్లి గ్రామశివారులో పేకాటస్థావరంపై బుధవారం దాడి చేసి రాజు, సంతోష్‌, నర్సయ్యలను పట్టుకున్నట్లు ఎస్సై మురళి తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి, రూ.8,700 లు, మూడు బైక్‌లు, మూడు మొబైల్‌ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

'ట్రామా కేర్‌' ఏర్పాటు చేయరూ..!

- అత్యవసర సేవలందక ప్రాణాలు కోల్పోతున్న బాధితులు
- ట్రామాకేర్‌ సెంటర్‌కు అనుకూలంగా ఆర్మూర్‌ ఏరియా ఆస్పత్రి



ఆర్మూర్‌ ఏరియా ఆస్పత్రి

ఆర్మూర్‌టౌన్‌: రోడ్డు ప్రమాదం లేదా ప్రకృతి విపత్తు సమయంలో సకాలంలో వైద్యమందిస్తే ప్రాణాలు నిలుస్తాయి. కాస్త ఆలస్యమైనా ప్రాణాలు పోవడంతోపాటు శాశ్వత అంగవైకల్యం బారినపడే ప్రమాదం ఉంది. ఆర్మూర్‌ పట్టణం రెండు (44వ నంబర్‌, 63వ నెంబర్‌) జాతీయ రహదారులకు కూడలిగా ఉండడంతో వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రులను 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మధ్యలోనే ప్రాణాలు కోల్పోయిన ఘటనలున్నాయి. ఆర్మూర్‌ ఏరియా ఆస్పత్రిలో ట్రామా కేర్‌ సెంటర్‌ను ఏర్పాటు చేస్తే ప్రమాదం జరిగిన వెంటనే మెరుగైన వైద్యం అంది ప్రాణాలు కాపాడొచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సెంటర్‌ ఏర్పాటు చేయాలి

జాతీయ రహదారులకు దగ్గరలోనే ఏరియా ఆస్పత్రి ఉంది. ఆర్మూర్‌ ఏరియా ఆస్పత్రిలో ట్రామా కేర్‌ సెంటర్‌ ఏర్పాటు చేయాలి. ప్రమాదాలకు గురైన వారికి అత్యవసర సేవలు అందించి ప్రాణాలను కాపాడవచ్చు. – అరుణ్‌, ఆర్మూర్‌

కూతురు పెళ్లైన రెండు రోజులకే..

- గుండెపోటుతో తండ్రి మరణం



పోస్టుమన్‌ గంగాధర్‌ (ఫైల్‌)

నందిపేట్‌(ఆర్మూర్‌): కూతురి పెళ్లైన రెండు రోజులకే గుండెపోటుతో తండ్రి మరణించిన ఘటన నందిపేటలో చోటు చేసుకుంది. నందిపేట మండల కేంద్రంలో గత 30ఏళ్లుగా సేవలందిస్తున్న పోస్టుమన్‌ గంగాధర్‌ (50)కు ముగ్గురు కూతుళ్లు కాగా చిన్న కూతురు పెళ్లిని ఆదివారం రోజు ఘనంగా చేశారు. మంగళవారం కూతురి అత్తగారింటికి టాటావ్యాన్‌లో కుటుంబంతో సహా వెళుతుండగా మార్గమధ్యలో ఒక్కసారిగా గంగాధర్‌కు గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా, ఫలితం లేకుండా పోయింది. 30ఏళ్లుగా గ్రామీణ డాక్‌ సేవక్‌గా ప్రజలకు సేవలందిస్తూ ప్రతి ఒక్కరి హృదయాలలో నిలిచిన పోస్టు గంగాధర్‌.. కూతురు పెళ్లి జరిగి రెండు రోజులు గడువక ముందే హఠన్మరణం చెందడంతో గ్రామస్తులంతా తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. అంత్యక్రియలలో వేలాది మంది పాల్గొని కంటతడి పెట్టారు.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల మృతి

- బైక్‌ను ఢీకొన్న డీసీఎం వాహనం
- ఆర్మూర్‌లో విషాదఛాయలు



నాగార్జున (ఫైల్‌)



నరేందర్‌ (ఫైల్‌)

ఆర్మూర్‌ టౌన్‌: రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు మృతి చెందిన విషాద ఘటన ఆర్మూర్‌ మండలం చేపూర్‌ శివారులోని 63వ నంబర్‌ జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. ఆర్మూర్‌ పట్టణానికి చెందిన కొండూరు నాగార్జున్‌ (21), నరేంద్ర (19) గత ఆదివారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపురం గ్రామంలోని మేనత్త ఇంట్లో జరిగిన శుభకార్యానికి బైక్‌పై వెళ్లారు. బుధవారం ఉదయం తిరిగి వస్తుండగా చేపూర్‌ సమీపంలో ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్‌ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో నాగార్జున్‌ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాలపాలైన నరేందర్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు విడిచాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఇరువైపులా నిలిచిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్‌ ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఒంటరైన తల్లి..

ఆర్మూర్‌ పట్టణంలోని జెండాగల్లీలో నివాసముండే కొండూరు పద్మ భర్త ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. నాగార్జున్‌ హైదరాబాద్‌లో ఏసీ మెకానిక్‌గా పనిచేస్తుండగా తమ్ముడు నరేంద్ర అక్కడే హోటల్‌ మేనేజ్‌మెంట్‌ చదువుతున్నాడు. వారం క్రితమే ఆర్మూర్‌లోని ఇంటికి వచ్చారు. అన్నదమ్ములిద్దరూ హైదరాబాద్‌కు బయల్దేరాల్సి ఉండగా ప్రమాదం చోటు చేసుకుంది. కొడుకులు ఇప్పుడిప్పుడే వృద్ధిలోకి వస్తున్నారనుకుంటుండగానే రోడ్డు ప్రమాదం ఇద్దరిని బలిగొంది. కట్టుకున్న భర్త, ఇద్దరు కుమారులు లోకం వదిలి వెళ్లడంతో తల్లి పద్మ ఒంటరిగా మిగిలింది.

మతి స్థిమితంలేని ఒకరు..

దోమకొండ: భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామానికి చెందిన సురేశ్‌(52) అనే వ్యక్తి దోమకొండ మండలం లింగుపల్లి గ్రామ శివారులో మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సురేశ్‌కు మతి స్థిమితం సరిగా లేకపోవడంతో భార్య సంధ్య తన ముగ్గురు కుమారులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటోంది. సురేశ్‌ లింగుపల్లి గ్రామంలో రెండు రోజుల క్రితం భిక్షాటన చేసుకుంటూ ఎండ నుంచి కాపాడుకోవడానికి శివారులోని వ్యవసాయ బావి వద్ద ఒడ్డుపై పడుకున్నాడు. ఎండదెబ్బకు నిద్రలోనే మరణించాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలాన్ని ఏఎస్సై జానీ బాషా పరిశీలించి, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్‌

వాహనంలో నిద్రిస్తున్న వ్యక్తిపై దాడి

- బంగారు ఆభరణాల దోపిడీ

పిట్లం(జుక్కల్‌): వాహనంలో నిద్రిస్తున్న వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో దాడిచేసి బంగారు ఆభరణాలను దోచుకున్న ఘటన బుధవారం ధర్మారం టోల్‌ప్లాజా వద్ద చోటు చేసుకుంది. ఏఎస్సై లింబాద్రి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్‌ జిల్లా జగద్గిరిగుట్ట కుత్బుల్లాపూర్‌ మండలానికి చెందిన కృష్ణారెడ్డి పని నిమిత్తం తన అశోక్‌ లేలాండ్‌ వాహనంలో హైదరాబాద్‌ నుంచి ప్లాస్టిక్‌ డిస్పోజల్‌ గ్లాసులను బిచ్కుందకు తీసుకువచ్చాడు. బుధవారం అర్ధరాత్రి ఆయన తిరిగి వెళ్తూ పిట్లం మండలంలోని ధర్మారం టోల్‌ ప్లాజా వద్ద వాహనం నిలిపి నిద్రపోయాడు. టోల్‌ప్లాజా వైపు నుంచి గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు వచ్చి వాహనంలో నిద్రిస్తున్న కృష్ణారెడ్డిపై కత్తితో దాడి చేసి రెండుతులాల బంగారు గొలుసు, తులం ఉంగరాన్ని దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

గ్రామ పంచాయతీపై రాళ్లదాడి



నిజాంసాగర్‌(జుక్కల్‌): మహమ్మద్‌ నగర్‌ మండలంలోని గాలీపూర్‌ గ్రామ పంచాయతీ కార్యాలయం కార్యదర్శి చాంబర్‌పై గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి రాళ్లదాడికి పాల్పడ్డారు. దీంతో కుర్చీలు, ఫర్నిచర్‌ ధ్వంసమయ్యాయి. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చోరీలకు పాల్పడిన మహిళ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవీందర్‌నాయక్‌

ఎల్లారెడ్డి: ఇళ్లలో చోరీలకు పాల్పడిన మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్‌ బుధవారం తెలిపారు. ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని సాతెల్లి గ్రామానికి చెందిన నీరడి మంజుల (45) ఎల్లారెడ్డి పట్టణంలో అనుమానాస్పదంగా నగలు విక్రయించేందుకు రాగా పట్టుకొని విచారించడంతో అసలు విషయం బయటపడిందన్నారు. ఏప్రిల్‌ 3న అనిత అనే ఇంట్లో చోరికి పాల్పడి బంగారు ముక్కుపుడక దొంగిలించిందని తెలిపారు. ఈ నెల 9న దుద్దుల దుర్గయ్య ఇంట్లో 5 తులాల వెండి, రూ.10 వేల నగదు, మంగళి కిషన్‌ ఇంట్లో 20 తులాల వెండి, చెవి కమ్మలు, రూ.13 వేల నగదును చోరీ చేసినట్లు పేర్కొన్నారు. తానే ఈ చోరీలకు పాల్పడినట్లు మంజుల ఒప్పుకుందని, ఆమె నుంచి ఒక జత బంగారు కమ్మలు, 20 తులాల వెండి, 5 తులాల వెండి కడియం, రూ.12 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితురాలిని పట్టుకున్న ఎస్సై మహేశ్‌, పీసీ ఇద్రీస్‌, హోంగార్డు ప్రసాద్‌లను ఎస్పీ అభినందించినట్లు సీఐ తెలిపారు.

చోరీ కేసులో ఒకరికి 16 నెలల జైలు

కామారెడ్డి క్రైం: దేవాలయంలో చోరీకి పాల్పడిన ఓ నిందితుడికి ఎల్లారెడ్డి కోర్టు 16 నెలల జైలు శిక్ష విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. 2024 ఫిబ్రవరి 4న ఎల్లారెడ్డిలోని అయ్యప్ప ఆలయంలో చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు తాళాలు పగలగొట్టి హుండీ దోచుకెళ్లారు. ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని పోసానిపల్లి గ్రామానికి చెందిన జంగం నర్సింలుగా గుర్తించారు. అతనిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు పంపారు. అప్పటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. నేరం రుజువు కావడంతో ఎల్లారెడ్డి కోర్టు న్యాయమూర్తి ఎం సుష్మ నిందితుడికి 16 నెలల జైలు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారు. కేసును సరైన పద్ధతిలో విచారణ చేసిన ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్‌, కోర్టు లైజనింగ్‌ అధికారి ఎస్సై రాజయ్య, ఏఎస్సై రామేశ్వర్‌ రెడ్డి, సిబ్బంది నరేందర్‌ను ఎస్పీ రాజేశ్‌ చంద్ర అభినందించారు.

తాగి వాహనం నడిపిన ఒకరికి..

ధర్పల్లి: మద్యం తాగి వాహనం నడుపుతూ డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష పడినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. మద్దుల్‌ చౌరస్తా వద్ద ఈ నెల 12న పోలీసులు డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ తనిఖీలు నిర్వహించగా సిరికొండ మండలానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. పోలీసులు నిజామాబాద్‌ సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ ఎదుట బుధవారం హాజరుపరచగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్సై తెలిపారు.

హాట్‌ టాపిక్‌గా ఎస్సై వ్యవహారం

- ఫిర్యాదుదారులను పట్టించుకోడనే ఆరోపణలు
- ఎస్సై పనితీరుపై మండిపడ్డ సీపీ
- పోలీస్‌స్టేషన్‌ తనిఖీలో మందలింపు

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలోని ఆర్మూర్‌ సబ్‌ డివిజన్‌లోని ఓ ఎస్సై పనితీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తమ గోడును చెప్పుకుందామంటే ఎస్సై అందుబాటులో ఉండరు. ఎస్సై ఉన్న సమయంలో బాధితులు గదిలోకి వెళ్లిన తర్వాత బెదిరింపులకు పాల్పడతారనే విమర్శలున్నాయి. పోలీస్‌స్టేషన్‌ చుట్టూ తిరిగినా కేసును నమోదు చేయకపోవడంతో కోర్టును ఆశ్రయించిన బాధితులు చాలా మంది ఉన్నారు. కోర్టు నుంచి ఆదేశాలు వస్తేనే సదరు ఎస్సై కేసు నమోదు చేసిన దాఖలాలున్నాయి. ఎస్సై తీరుపై విసుగుచెందిన బాధితులు సీపీ సాయిచైతన్య వద్దకు వచ్చి తమ సమస్యను చెప్పుకున్న సందర్భాలున్నాయి. ఇటీవల సీపీ సాయిచైతన్య పోలీస్‌స్టేషన్‌ తనిఖీల్లో భాగంగా సదరు పీఎస్‌కు వెళ్లినప్పుడు ఎక్కువ సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుసుకొని ఎస్సైపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సీపీ వద్దకు వచ్చిన వారి దరఖాస్తులను సిబ్బంది సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు పంపిస్తారు. ఈ ఫిర్యాదులను ఎస్సై ఆదేశాల మేరకు పీఎస్‌ సిబ్బంది బాధితులను పిలిపించి సమస్యలను అడిగి తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉటుంది. కానీ, ఈ ఎస్సై ఫిర్యాదులను పరిష్కరించకపోవడంతో సీపీ మందలించినట్లు సమాచారం. ఇటీవల ఎస్సైలతో వీడియో కాన్ఫరెన్స్‌ జరుగుతున్న సమయంలో ఎస్సై ఫిర్యాదుదారులతో మాట్లాడిన తీరుపై ఏసీపీ మండిపడినట్లు తెలిసింది. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఎస్సై పనితీరుపై అధికార పార్టీ నేతలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై నియోజకవర్గ నేత దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది.

గౌతంనగర్‌లో పోలీసుల తనిఖీలు

60 వాహనాల స్వాధీనం



తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో పోలీస్‌ స్టేషన్‌ పరిధి గౌతంనగర్‌లో బుధవారం రాత్రి సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు అడిషనల్‌ డీసీపీ బస్వా రెడ్డి సూచన మేరకు ఏసీపీ రాజా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్‌ ప్రోగ్రాం నిర్వహించారు. 100 మంది పోలీసులు 10 బృందాలుగా ఏర్పడి పెట్రోలింగ్‌ చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, రౌడీ షీటర్లను తనిఖీ చేశారు. ధ్రువపత్రాలు, నంబర్లు లేని దాదాపు 60 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రజలు పోలీసులని, చట్టాన్ని గౌరవించాలన్నారు. అనుమానితులు, అసాంఘిక కార్యకలాపాలపై సమీప పోలీస్‌ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. కాలనీవాసులు ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం కాలనీవాసుల సూచనలు, సలహాలు స్వీకరించారు. కార్యక్రమంలో సీఐలు శ్రీనివాస్‌ రాజ్‌, రఘుపతి, సురేశ్‌, మల్లేశ్‌, భిక్షపతి, శ్రీలత, ఎస్సైలు హరిబాబు, గంగాధర్‌, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.